క్లుప్తంగా

విద్యుత్ తీగల సమస్య పరిష్కారం



సాక్షి ఎఫెక్ట్..

సంగెం: మండలంలోని మొండ్రాయి గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను ఆ శాఖ అధికారులు శనివారం పరిష్కరించారు.పంట పొలాల్లో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' శీర్షికన ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ శాఖ ఏఈ మధుసూదన్ స్పందించారు. శనివారం నాడు మిడిల్ వేయించి లూజు లైన్‌ను సరిచేయించారు. దీంతో ఎస్ఎస్ 41 పరిధిలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు నమోదులో బీఎల్ఓలు కీలకం



సంగెం: ప్రత్యేక ఓటరు నమోదులో బీఎల్ఓలు కీలకమని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మొండ్రాయి, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాలను శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. యువ ఓటర్లకు అవగాహన కల్పించి నమోదు చేయాలని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన అలుగునూరి సరోజన ఎల్లయ్య కొడుకు రాజు అనిత శనివారం రూ.50,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. వర్ధన్నపేటకు చెందిన ఆకుల కృష్ణ మరొకరి ద్విచక్ర వాహనంపై తొర్రూరు నుంచి వస్తుండగా రాయపర్తికి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రెండు వాహనాలూ ఎదురెదురుగా వచ్చి ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు. కృష్ణ భార్య శ్రీలత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్

సంగెం : రేపు (సోమవారం) మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో గీసుకొండ, సంగెం మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏడీఈ నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలుంటే సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సదస్సు దృష్టికి తీసుకురావాలని సూచించారు. నెలవారీ బిల్లుల్లో, లైన్లల్లో, లోఓల్టేజీ, తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సదస్సుకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ తిరుమల్‌రావు, ఫైనాన్స్ మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ నరేందర్ పాల్గొంటారని తెలిపారు. గ్రీవెన్స్‌ను సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

మార్కెట్‌కు సెలవు

నెక్కొండ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు రేపు (సోమవారం) సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగిన, మిల్లర్లు, ట్రేడర్లు అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. మంగళవారం క్రయవిక్రయాలు యధావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న డీఎల్‌పీఓ



ఖానాపురం : మాట్లాడుతున్న సర్పంచ్



పర్వతగిరి : మాట్లాడుతున్న జీపీ కార్యదర్శి



చెన్నారావుపేట : మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీధర్



దుగ్గొండి: మాట్లాడుతున్న సర్పంచ్ మమతరాజు

● డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

నర్సంపేట రూరల్ : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికలు రూపొందించనున్నట్లు డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని లక్నెపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన డీపీఈపీ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి చేపట్టే క్రమంలో ప్రజల సూచనలు, సలహాలు తీసుకుని నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే మొదటి ప్రాధాన్యతగా పనులకు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిశాల రాంబాబు, ఎంపీఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అనిత, వార్డు సభ్యుడు కత్తి కిరణ్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని జోజిపేట, నారాయణతండా, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయిగూడెం, బాపునగర్ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఎంపీడీఓ ఈగల భారతి పాల్గొని మాట్లాడారు. అలాగే అక్కల్‌చెడ, కోనాపురం, ఉప్పరపల్లి గ్రామాల్లో ఎంపీఓ అంబటి శ్రీధర్ రాజు, లింగగిరి, శంకరతండా, జల్లి, చెన్నారావుపేట గ్రామాల్లో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గద్దం దయాకర్, ఖల్‌నాయక్‌తండా, లింగాపురం, జీడిగడ్డతండాల్లో ఈజీఎస్ ఏపీఓ అరుణ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్ రాజు మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్‌లో నిర్వహించిన సభకు సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా మురికి కాల్వల, వీధి లైట్ల నిర్వహణ సక్రమంగా లేదని ప్రజలు సభ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇంటి పర్మిషన్ ఇవ్వడంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు 6వ వార్డు సభ్యురాలు బర్ల స్వప్న భర్త ప్రవీణ్ ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్, వార్డు సభ్యుడు పరోత్య, ఏఎస్ఎం సుమలత, ఫీల్డ్ అసిస్టెంట్ రాము, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, రజిత, ఆశావర్కర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్, బోటిమీదితండా, ధర్మరావుపేట, ఖానాపురం, కొడ్తిమాటుతండా, కొత్తూరు, నాజీతండా, రాగంపేట, రంగాపురం, వేపచెట్టుతండా గ్రామాల్లో సభలు నిర్వహించారు. తొమ్మిది అంశాలపై ప్రణాళికలు తయారు చేశారు. సభల్లో సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి, మందపల్లి, మర్రిపల్లి, ముద్దునూరు, మైసంపల్లి, నాచినపల్లి, నారాయణతండా, పీజీతండా, పొనకల్, రాజ్యాతండా, రేబల్లె, రేకంపల్లి, శివాజీనగర్, స్వామిరావుపల్లి, తిమ్మంపేట, తొగర్రాయి, వెంకటాపురం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జీపీడీపీ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజల సూచన మేరకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ గౌడ్, సర్పంచ్ పెండ్యాల మమత రాజు, చుక్క రమేశ్, బానోతు రవీందర్, ఒడేటి తిరుపతిరెడ్డి, లింగంపల్లి రమ, మోడెం విద్యాసాగర్, సురేందర్‌రెడ్డి, ఊర్మిళ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'సఖి'తో బాధిత మహిళలకు రక్షణ



సఖి సేవల పోస్టర్లను ప్రదర్శిస్తున్న నూర్జహాన్, తదితరులు

గీసుకొండ: సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలకు రక్షణ లభిస్తుందని కౌన్సిలర్ నూర్జహాన్, న్యాయవాది శోభారాణి తెలిపారు. మండలంలోని ధర్మారంలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. పలువురు మహిళలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. విద్యార్థి దశలోనే సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై చైతన్యవంతం కావాలని చెప్పారు. మహిళలు గృహహింస, ఇతర సమస్యల నేపథ్యంలో 181 మహిళా హెల్ప్ లైన్, చైల్డ్‌లైన్ 1098, 0870–3571832 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ, ఇతర సాయం అందుతుందని వివరించారు. మహిళలు సఖి కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సఖి సేవల పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యుడు కొక్కొండ శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలను ప్రోత్సహిస్తే ఉన్నతి ఖాయం

● కేయూ విశ్రాంత ఉపకులపతి గోపాల్‌రెడ్డి



విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందిస్తున్న గోపాల్‌రెడ్డి

సంగెం: బాలికలను ప్రోత్సహిస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకోవడం ఖాయమని కాకతీయ విశ్వవిద్యాలయ (కేయూ) విశ్రాంత ఉపకులపతి (వీసీ) ఆచార్య వంగాల గోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కాపుల కనపర్తి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో లయన్ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం టై, బెల్ట్, స్టడీ మెటీరియల్ తోపాటు ఆటల పోటీల నిర్వహణకు ఆర్థికక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడారు. సమాజం బాలికలను చదువుల్లో ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. బాలికలు విద్యావంతులైతే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బాలికల పట్ల వివక్ష తగదన్నారు. బాలబాలికలను తల్లిదండ్రులు సమదృష్టితో పెంచాలని సూచించారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ రీజియన్ చైర్మన్ కె.సుభాన్, సభ్యులు సర్వరాజుద్దీన్, రమణారెడ్డి, మహేందర్‌రెడ్డి, వినోద్, ఆనంద్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు కమల, రాజన్న, వెంకటేశ్వర్లు, పద్మజ, కవిత, స్వప్నకుమారి, కరుణకుమారి, రాజేశ్వర్‌రావు, అశోక్, మన్సూన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేలా మహిళలకు శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ అరుణజ్యోతి

వర్ధన్నపేట: మహిళలకు ఉపాధి కల్పించేలా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్ర పరిశోధకురాలు డాక్టర్ అరుణజ్యోతి తెలిపారు. మండలంలోని నల్లబెల్లిలో మామునూరు కేవీకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాగులు, సెల్‌ఫోన్ పౌచ్‌లు, చేతి తొడుగుల తయారీ శిక్షణా శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహిళలు శిక్షణలో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. మహిళలు శిక్షణను వినియోగించుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని చెప్పారు. ప్రస్తుతం ప్లాస్టిక్ బ్యాగుల నివారణ నేపథ్యంలో క్లాత్ బ్యాగులు వాడుకలోకి వచ్చాయన్నారు. క్లాత్‌తో తయారు చేసే వస్తువులకు డిమాండ్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నల్లబెల్లి సర్పంచ్ ముత్యం దేవేంద్ర, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, జెడ్పీఎస్ఎస్ హెచ్ఎం రమేశ్, ఆదర్శ సామాజిక ప్రగతి యువజన సంఘం సభ్యుడు దిలీప్, సందీప్, సిద్ధూ, అనిల్, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచడమే ధ్యేయం

● ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ హర్షితరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షితరెడ్డి

నర్సంపేట రూరల్ : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడమే ధ్యేయంగా బాలసభలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ హర్షితరెడ్డి తెలిపారు. 'బేటీ బచావో.. బేటీ పడావో..' స్కీంలో భాగంగా మహిళల సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని గురిజాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్‌లో బాలసభ, డ్రాయింగ్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షితరెడ్డి మాట్లాడారు. బాలికలకు చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు. ఆపత్కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలికలు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై చైతన్యవంతులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు అవసరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిశాల మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాతం, వైద్యురాలు సహజ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థి ఎంపిక

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల విద్యాలయలో 9వ తరగతి చదువుతున్న మాలోతు తరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణలో మీడియాతో శనివారం ఆయన మాట్లాడారు. గత నెలలో జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో పాఠశాల విద్యార్థులు జూనియర్, సీనియర్ విభాగాల్లో 5 చొప్పున అంశాలను ప్రదర్శించారని చెప్పారు. గైడ్ టీచర్ దామెర గణేశ్ సహకారంతో సీనియర్ విభాగంలో తరుణ్‌కుమార్ 'మెష్, నెట్‌వర్క్ టోపాలాజీ' ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని, గైడ్ టీచర్‌ను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి, మేడి రమేశ్‌గౌడ్, వల్లా వేణు, కృష్ణమోహన్, జగదీశ్వర్, బాలరాజు, వైనాల రాజు, వెంకటేశ్వర్లు, నవీన్, వీరాచారి, పొన్న రమేశ్, ఆరె రాజు, నామాల సృజన, పద్మ, కవిత, స్రవంతి, దివ్యజ్యోతి, రోజ, సంధ్య, శైలజ, సునీత తదితరులు అభినందించారు.


'బీజేపీ మతోన్మాద కుట్రలను తిప్పికొట్టాలి'

పర్వతగిరి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద కుట్రలను తిప్పికొట్టాలని రెవెల్యూషనరీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ ప్రజలను కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మనువాద భావజాలాన్ని పెంపొందిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టి రానున్న పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచేందుకు యత్నిస్తోందని చెప్పారు. బీజేపీని ఓడించడానికి వామపక్ష, లౌకిక సామాజిక శక్తులు చొరవ చూపాలని కోరారు. గత పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అయోధ్య రామ మందిర నిర్మాణం పేరుతో దేశ ప్రజల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చేందుకు కుట్ర చేస్తోందన్నారు. బీజేపీ కుట్రలను మేధావులు, సామాజిక కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

'రాజకీయ పదవులకు పాకులాడొద్దు'

చెన్నారావుపేట : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజకీయ పదవుల కోసం పాకులాడొద్దని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పదవుల కోసం కొందరు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాకులాడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. గౌరవప్రదమైన వృత్తిని అపవిత్రం చేయొద్దని, ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చు పెట్టొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చిన ఉద్యోగ, ఉపాధ్యాయుల హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

'సమాచారం ఇవ్వని అధికారులపై కేసులు పెట్టొచ్చు'



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నర్సంపేట : ప్రభుత్వ కార్యాలయంలో కోరిన సమాచారం ఇవ్వని అధికారులపై పోలీస్ కేసులు పెట్టొచ్చని సమాచార హక్కు (సహ) చట్టం కార్యకర్తల సంఘం జిల్లా కన్వీనర్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడిగిన సమాచారం పూర్తిగా లేదని చెప్పే అధికారులను సదరు సమాచారం కలిగిన ఫైళ్లు ఏమయ్యాయని, పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని నిలదీయాలని చెప్పారు. సమాచారం లభించకుండా ఫైళ్లు మాయమైన సందర్భాల్లో పోలీసులకు ఫిర్యాదు చేయని అధికారిపై ఆర్టీఐ దరఖాస్తుదారుడు కేసు పెట్టవచ్చని చట్టంలో ఉందన్నారు. పూర్తి సమాచారం ఇవ్వని వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

నర్సయ్య సేవలు మరువలేనివి



రాయపర్తి : నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, తదితరులు

రాయపర్తి : తెలంగాణ ఉద్యమకారుడు తాళ్లపల్లి నర్సయ్య సేవలు మరువలేనివని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని శివరామపురంలో ఏర్పాటు చేసిన నర్సయ్య విగ్రహాన్ని శనివారం వారు ఆవిష్కరించి నివాళులర్పించి మాట్లాడారు. సీపీఐ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పని చేశాడని కొనియాడారు. సీపీఐ నాయకులు ఎ.సుబ్బారావు, మేకల రవి, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, మండల కార్యదర్శి గాజు యాకయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, నాయకులు ఆకుల సురేందర్‌రావు, చెడుపాక కుమారస్వామి, అనిరెడ్డి యాదమ్మ యాకూబ్‌రెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, జగన్, క్రాంతి, ఎండీ.నయీం, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, నాగపురి సోమన్న, అశోక్, బండి ఉప్పలయ్య, రాసకొండ సోమయ్య, యాకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్షనపల్లి రాజేశ్వర్‌రావు ప్రథమ వర్ధంతి

నర్సంపేట రూరల్ : మండలంలోని ముగ్దుంపురంలోని శ్రీరామ విత్తన సంఘం ఆవరణలో మాజీ సర్పంచ్, చెన్నారావుపేట మాజీ ఎంపీపీ అర్షనపల్లి రాజేశ్వర్‌రావు ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు అర్షనపల్లి ప్రభాకర్‌రావు, పాలకవర్గ సభ్యుడు గోపు జయపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాజేశ్వర్‌రావు 20 ఏళ్లపాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని చెప్పారు. 1987లో చెన్నారావుపేట మండల పరిషత్ అధ్యక్షుడిగా, సహకార సంఘం అధ్యక్షుడిగా, పొదుపు సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి వన్నె తెచ్చారని కొనియాడారు. రాజేశ్వర్‌రావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో కేసీటీసీ ప్రోగ్రాం ఆఫీసర్ యాకూబ్ నాయక్, నాయకులు నూనె కుమారస్వామి, స్వప్న, నామాల

మాజీ సర్పంచ్‌కు నివాళి

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెం మాజీ సర్పంచ్ కక్కెర్ల సారయ్య (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సారయ్య కుటుంబాన్ని సారంగపాణి పరామర్శించారు. సారయ్య కొడుకు యాదగిరిని, కుటుంబాన్ని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాలెపు రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, వైస్ ఎంపీపీ గండె శ్రీలత, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, నాయకులు సాంబరెడ్డి, ఇంగ్లీ శివాజీ, రాజ్‌కుమార్, తదితరులు పరామర్శించారు.

రావూరులో..

పర్వతగిరి : మండలంలోని రావూరుకు చెందిన గుగులోతు రాములు శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి సర్పంచ్ బండి సంతోశ్, ఉపసర్పంచ్ అమిలాల్ శనివారం నివాళులర్పించారు. అనంతరం రాములు కొడుకులైన శంకర్, ఈర్య, రవిలను సర్పంచ్, ఉపసర్పంచ్ పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గడ్డి యాకయ్య, కార్యదర్శి దేవీలాల్, నాయకులు నాగరాజు, రమేశ్, చందులాల్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆలయంలో 'స్వచ్ఛతీర్థ'



నర్సంపేట : ఆలయంలో ఊడుస్తున్న నాయకులు



నెక్కొండ : రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

నర్సంపేట : రేపు (ఈనెల 22న) అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించనున్న క్రమంలో ఆలయాలను శుభ్రం చేయాలన్న ప్రధాని పిలుపు మేరకు పట్టణంలోని రామాలయంలో బీజేపీ నాయకులు శనివారం స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పట్టణ కమిటీ అధ్యక్షుడు బాల్నె జగన్, నాయకులు రామాంజనేయులు, గూడూరు సందీప్, కోమాండ్ల సప్తగిరి, కందికొండ శ్రీను, కందగట్ల నాగరాజు, కనుక గణేశ్, దేవరకొండ నితీశ్, మెడిద అభిలాశ్, పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

నెక్కొండ : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. ఆలయ ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. రేపు (22న) మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంబాల రాంగోపాల్, రాపాక సందీప్, పులి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ వినీత

పర్వతగిరి : ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండడం ద్వారానే అభివృద్ధి చెందుతారని డీసీసీబీ స్థానిక శాఖ మేనేజర్ జె.వినీత తెలిపారు. డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని అన్నారం షరీఫ్, రావూరు, కల్లెడ గ్రామాల్లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు, ప్రజలు డబ్బు పొదుపు నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. వ్యవసాయ రుణాలు, వడ్డీ, రైతులకు సబ్సిడీ, బీమా స్కీములు, తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్వతగిరి, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్లు మనోజ్‌గౌడ్, గొర్రె దేవేందర్, సూపర్‌వైజర్ సుధాకరాచారి, సీఈఓ సురేశ్, ఉద్యోగులు వెంకట్, సాయికుమార్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఊడుగుల సునీత, తదితరులు

నల్లబెల్లి : పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 డైరీని ఎంపీపీ ఊడుగుల సునీత ఎంపీడీఓ విజయ్‌కుమార్, సంఘం మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్, తదితరులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం క్రియాశీలకంగా వ్యవహరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పోలోజు భిక్షపతి, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల సుభాశ్, లక్కర్సు ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి పొగాకు అచ్చయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పీరాల మల్లయ్య, జిల్లా కార్యదర్శి వెంకట్రామనర్సయ్య, మండల కార్యదర్శి బానోత్ కృష్ణ, ఉపాధ్యాయులు భద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.